క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కౌటాల: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ శుక్రవారం తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సమావేశానికి తమ శాఖల నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

8న వీర్దండిలో జాతర

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామ సమీపంలో వార్ధా నది ఒడ్డున గల జై భీర్య హనుమాన్ మందిర్ ప్రశాంత్ ధాం ఆలయంలో మార్చి 8న మహా జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు జాతర ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో జీవస్వరం



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కౌటాల: మండల కేంద్రంలోని ఇన్ఫంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం జీవస్వరం సువార్త స్వస్థత కూటములను భక్తిశ్రద్ధలతో జ్యోతి ప్రజల్వన చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిషప్ ప్రిన్స్ అంతోని ప్రారంభించారు. ఆయన క్రైస్తవులకు దేవుని వ్యాఖ్యం బోధించారు. కూటముల్లో ఫాదర్లు సీజో, సతీష్, బైజో తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి చేయూత



సరుకులు అందజేస్తున్న సభ్యులు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామానికి చెందిన నిరుపేద దంపతులకు శుక్రవారం చేయూతనందించారు. మండిగ గోపాల్, అతని భార్య సోమక్క ఇద్దరు అంధులు కాగా పేదరికంలో మగ్గుతున్నారు. చింతలమానెపల్లి గ్రామానికి చెందిన లోడెల్లి సుధాకర్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, బట్టలు అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త లోడెల్లి ప్రవీణ్ కుమార్, బోర్కుట్ వెంకన్న, ముర్‌ముర్ మధుకర్, లోడెల్లి ప్రశాంత్, తోటపెల్లి సాలయ్య పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సారంగపాణి, జిల్లా అధ్యక్షుడు అంబాల రవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో బీడీపీపీ భూములను అక్రమంగా చదును చేసి ఆక్రమిస్తున్నారని, రాజంపేట శివారులో డంపింగ్ యార్డు పక్కన ప్రభుత్వ భూమిలో వెంచర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. అలాగే గుండి రోడ్డు, రవిచంద్ర కాలనీ, అంకుసాపూర్, సామెల శివారులోనూ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. కబ్జాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు చేపట్టని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నరేశ్, రాజు, సురేశ్, పవన్ పాల్గొన్నారు.

అమ్మాయిలను వేధిస్తే చర్యలు

తలమడుగు: అమ్మాయిలను ఎవరైనా వేధిస్తే చర్యల తప్పవని షీటీం సిబ్బంది సుశీల, సత్య మోహన్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పల్లి(బి) జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో, గ్రామాలలో అమ్మాయిలను ఎవరైనా పోకిరిలు ఏడిపించిన, ర్యాగింగ్ చేసిన చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర పరిస్థిల్లో 100కు, 1930కి కాల్ చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు.

పశువుల దాహం తీరేదెలా?

- నిరుపయోగంగా మారిన నీటి తొట్టెలు
- మురుగునీరు తాగుతున్న మూగజీవాలు
- తొట్టెల్లో నీరు నింపాలని రైతుల వేడుకోలు



అపరిశుభ్రంగా ఉన్న నీటి తొట్టె పరిసరాలు



నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టె

లింగాపూర్: మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మించారు. కానీ వాటిలో చుక్క నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాలు నీరు దొరక్క అవస్థలు పడుతున్నాయి. నీటి తొట్టెల నిర్మాణానికి వెచ్చించిన నిధులు వృథా కావడంతో అధికారుల తీరుపై మండలవాసులు మండిపడుతున్నారు.

పంచాయతీలతే బాధ్యత..

మండలంలో దాదాపు 20కి పైగా నీటి తొట్టెలను పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించారు. ఇందుకు ఒక్కో నీటి తొట్టెపై రూ.30వేలు ఖర్చు చేశారు. పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెల బాధ్యత ప్రభుత్వం పంచాయతీలకే అప్పగించింది. కానీ అధికారుల పర్యవేక్షణ కొరవవడంతో తొట్టెలు నిర్మించారే తప్పా నీరు నింపకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో అపరిశుభ్రంగా ఉండడంతో పాటు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉపాధిహామీ నిధులతో వేలాది రూపాయలు వెచ్చించి నీటి తొట్టెలు నిర్మించారు. కానీ నీరు నిల్వ చేయకపోవడంతో మూగజీవాలు దాహార్తి తీర్చుకునేందుకు సమీపంలోని మురికి కాలువలోని నీరు తాగుతున్నాయి. దీంతో అవి అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నీటి తొట్టెల్లో మిషన్ భగీరథ ద్వారా నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిల్వ నీటిని తొలగించాలి



నీటి తొట్టెల్లో నీరు నింపకపోవడంతో మూగజీవాలు మురికి కాలువల్లోని నీటిని తాగుతున్నాయి. దీంతో అవి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. కాలువ నుంచి దుర్వాసనతో ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి.

– పవార్ దేవిదాస్, లింగాపూర్

తొట్టెల్లో నీటిని నింపాలి



ఉపాధిహామీ పథకం ద్వారా కట్టించిన పశువుల తొట్టెల్లో నీటిని నింపడం లేదు. దీంతో దాహార్తి తట్టుకోలేక మూగజీవాలు అల్లాడుతున్నాయి. మిషన్ భగీరథ నీటిని నీటి తొట్టెల్లో నింపేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జాటోత్ తుకారాం, లింగాపూర్

జగ్జీవన్‌రాం భవన్‌కు స్థలం కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: దళిత నేత బాబూ జగ్జీవన్‌రాం భవన్ నిర్మాణం కోసం జిల్లా కేంద్రంలో 2 ఎకరాల స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు రేగుంట కేశవరావు మాదిగ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా జగ్జీవన్‌రాం భవన్ కోసం వినతి పత్రాలు సమర్పిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఏప్రిల్ 5న బాబూ జగ్జీవన్‌రాం జయంతి పురస్కరించుకొని స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు గుడిసెల రవి, దుర్గం ప్రతాప్, మాలి సంఘం నాయకులు నాగోశ శంకర్ ఉన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన న్యాయవాదులు



కిషన్‌రెడ్డితో న్యాయవాదులు

ఆసిఫాబాద్‌అర్బన్: విజయసంకల్ప యాత్రలో భాగంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకోగా ఆసిఫాబాద్‌కు చెందిన పలువురు న్యాయవాదులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీష్‌బాబు మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ మరోసారి గెలుస్తుందన్నారు. బీజేపీలో చేరిన న్యాయవాదులకు కండువా కప్పి కిషన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, న్యాయవాదులు ధీరజ్, జగన్, భౌమిక్, చరణ్‌తేజ, ఆకాష్, లాల్‌షా, గణేశ్ జాదవ్, వినయ్‌కుమార్ ఉన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీని నెరవేర్చాలని, అడ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ చెల్లించాలని, మెడికల్ కళాశాలలో టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను భర్తీ చేయాలని, జిల్లా ఆస్పత్రిలో వైద్యులు, ఇతర పోస్టులు భర్తీ చేయాలని కోరారు. మిగిలిన పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు రాజన్న, దుర్గం దినకర్ పాల్గొన్నారు.

పైకం అందేదెప్పుడో..?



బారెమోడి నుంచి సైకిల్‌పై వస్తున్న విద్యార్థులు



పాఠశాలకు ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

- అందని రవాణా భత్యం
- మూడేళ్లుగా ఇదే తంతు..
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- రాకపోకలకు తప్పని తిప్పలు

కెరమెరి: రవాణా భత్యం పేరిటా కొన్ని డబ్బులు ఖాతాలో జమ అయితే ఆర్థికంగా తోడ్పాటు కలుగుతుందని అనుకున్న పేద పిల్లల తల్లిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయి. మూడేళ్ల నుంచి విద్యార్థులకు రవాణా భత్యం విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సారైనా నిధులు విడుదల చేస్తారా అని విద్యార్థులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

అందని భత్యం..

ఉన్న ఊరిలో చదువుకునే అవకాశం లేక..ఇతర ప్రాంతాల్లో బడికి వెళ్తున్న విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు రవాణా భత్యం ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అది అమలుకు నోచుకోవడం లేదు. దీంతో మూడేళ్లుగా విద్యార్థులకు రవాణా భత్యం అందక పేద మధ్య తరగతి విద్యార్థుల తల్లిందడ్రులపై ఆర్థిక భారం పడుతోంది. అయితే మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 56 ఉండగా అందులో 3842 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో కెరమెరి, గోయగాం, ఝరి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు, మరిన్ని ప్రాథమికోన్నత తదితర పాఠశాల్లో విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణం చేస్తున్న వారు గతేడాది 116 మంది విద్యార్థులు ఉండగా, ఈ సంవత్సరం 103 మంది ఉన్నారు. వీరందరికి రవాణా భత్యం రావాల్సి ఉంది. గతంలోనే విద్యార్థులకు సంబంధించి బ్యాంకు ఖాతాలు తెరిచి ఖాతాల వివరాలు ఉన్నతాధికారులకు సమర్పించారు. నేటికీ వారి ఖాతాల్లో రవాణా భత్యం జమకాలేదు. ఖాతాలు తెరిచేందుకు అత్యుత్సాహం ప్రదర్శించే అధికారులు జమ చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

దూరాన్ని బట్టి రవాణా భత్యం!

విద్యార్థులు చదువుకునేందుకు వెళ్లేదూరాన్ని బట్టి రవాణా భత్యం అందిస్తారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు (1–5వ తరగతుల వరకు) కిలో మీటరు దూరం వెళ్లేవారికి నెలకు రూ.400 చొప్పున, మూడు కిలో మీటర్ల దూరం నుంచి పాఠశాలలకు వస్తున్న 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.600 చొప్పున 10 మాసాలకు సంబంధించి భత్యం అందిస్తారు. పలువురు బస్సు సౌకర్యం లేక మూడు నాలుగు కిలో మీటర్ల నుంచి కాలినడకన, సైకిళ్లపై, ఆటోల్లో వస్తున్నారు. చాలా చోట్ల బస్సులు సమయానికి రాక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా కొంత బలపడిన తల్లిదండ్రులు తమ పిల్లలకు సైకిళ్లు కొనిస్తుంటే.. పేదవాళ్లు మాత్రం ప్రతి రోజు ఆర్టీసీ బస్సుకు చార్జీలు పెట్టి పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా రవాణా భత్యం నిధులు మంజూరు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నివేదికలు సమర్పించాం..

గతంలోనే అర్హులైన దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థుల వివరాలను సేకరించాం. బ్యాంకుల్లో ఖాతాలు కూడా తెరిపించాం. వివరాలు ప్రభుత్వానికి సమర్పించాం. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. నిధులు మంజూరైతే విద్యార్థులు ఇచ్చిన ఖాతాల్లో రవాణా భత్యం జమచేస్తాం.

– కుడ్మెత సుధాకర్, ఎంఈవో, కెరమెరి

వనదేవతలకు మొక్కులు



రెబ్బెన: గంగాపూర్ ఒడ్డున సమ్మక్క గద్దెల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో ఏర్పాటు చేసిన గద్దెలపై దేవతలు సమ్మక్క, సారలమ్మలు కొలువుదీరారు. దేవతలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బంగారాన్ని సమర్పించడంతో పాటు ఒడి బియ్యం సమర్పించారు. కొంతమంది భక్తులు చిన్నారుల తలనీలాలు సమర్పించారు. జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో శుక్రవారం భక్తులు సమ్మక్క సారక్క జాతర ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని పెద్దబండ వాగు సమీపంలో ఉన్న సమ్మక్క సారక్క గద్దెల వద్ద భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని కోనేరు కాలనీ సమీపంలో ఉన్న గద్దెల వద్ద భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

కౌటాల: మండల కేంద్రానికి సమీపంలోని గుట్టపై సమక్క –సారలమ్మ గద్దెల వద్ద శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భజాభజంత్రీలతో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గద్దెలను దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు డబ్బా బాపు, తిరుపతి, గోపాల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా గద్దెలపై కొలువుదీరన సమ్మక్క సారలమ్మ తల్లులను భక్తులు దర్శించుకున్నారు. బంగారం, ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. గంగాపూర్ వాగు ఒడ్డున గల సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పూజారీ దేవార వినోద్, గొల్లపల్లి సత్తమ్మలు భక్తులకు బంగారం ప్రసాదంగా అందజేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న హరీశ్‌బాబు

దర్శించుకున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలోని గద్దెల వద్ద సమ్మక్క, సారలమ్మ దేవతలను శుక్రవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



కాగజ్‌నగర్‌రూరల్: మొక్కులు సమర్పిస్తున్న భక్తులు



సిర్పూర్(టి): గద్దెల వద్ద పూజలు చేస్తున భక్తులు



కౌటాల: పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

నార్నూర్: తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈఎంఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల 22 వరకు అడ్మిషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల, సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసిన అన్ని జిల్లాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అలాగే 7,8 తరగతిలో మిగిలిన సీట్లను కూడా భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

నగర సంకీర్తన

చెన్నూర్‌రూరల్: జై శ్రీమన్నారాయణ రామానుజ శ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి వారి మంగళశాసనములతో సమతా ఆధ్వర్యంలో సోమనపల్లి గ్రామంలో శుక్రవారం నగర సంకీర్తన చేపట్టారు.

ప్రమాదకరంగా రావి వృక్షం





ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరం సమీపంలోని జనవాసాల్లో ఓ రావి వృక్షం ప్రమాదకరంగా మారింది. వృక్షం వేర్లు బయటకి వచ్చి పక్కనే ఉన్న ఇళ్లపై పడే విధంగా ఉండడంతో పరిసరాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత మున్సిపాలిటీ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న వృక్షాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు ఉత్తమ గ్రేడ్‌లు సాధించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కెరమెరి: విద్యార్థులు బాగా చదివి పదో తరగతిలో ఉత్తమ గ్రేడులు సాధించాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోయగాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, మురళి, ప్రవీణ్, విజేష్, గణేశ్, విజయ, స్వప్న తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాసింగ్

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, బొంబాయిగూడ, ఎల్కపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీవో గంగాసింగ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతీ కూలీకి వంద రోజులు పని కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, టెంట్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పని ప్రదేశంలో జాగ్రత్తలు పాటించాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

యువ కవులకు సన్మానం



సన్మానిస్తున్న నిర్వాహకులు

వాంకిడి: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన మాతృభాష కవి సమ్మేళనంలో పాల్గొన్న మండలంలోని నగర్‌గుట్ట, మోకాసిగూడ గ్రామాలకు చెందిన యువ కవులు ఆత్రం మోతీరాం, కోట్నాక సాయికుమార్‌లు కొలామి, గోండి భాషల్లో కవిత గానం చేసి అలరించారు. ఈ మేరకు సాహిత్య అకాడమీ నిర్వాహక అధికారి షణ్ముకానంద్, నాగ మల్లేశ్వర రావు, నిర్వాహకులు మండలానికి చెందిన యువకవులను సన్మానించి, అభినందించారు.